సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 17 । అక్టోబర్ । 2024



భక్తిశ్రద్ధలతో కోజాగిరి పౌర్ణమి

వేములవాడఅర్బన్: కోజాగిరి పౌర్ణమిని పురస్కరించుకొని వేములవాడ రాజన్న ఆలయంలో బుధవారం రాత్రి 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ వేడుకను చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కొత్త పంతుళ్లు వచ్చారు



గంభీరావుపేట మండలానికి వచ్చిన టీచర్లు

ముస్తాబాద్/గంభీరావుపేట/ఇల్లంతకుంట/రుద్రంగి(వేములవాడ): ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు బుధవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరారు. ముస్తాబాద్ మండలానికి ఏడుగురిని కేటాయించారు. ఐదుగురు ఎస్జీటీ, ఇద్దరు భాష పండితులు తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరారని ఎంఈవో రాజిరెడ్డి తెలిపారు. గంభీరావుపేట మండలంలో 16 మంది ఎస్జీటీ, స్కూల్‌అసిస్టెంట్లు విధుల్లో చేరినట్లు ఎంఈవో గంగారాం తెలిపారు. రుద్రంగి మండలంలో 12 మంది ఉపాధ్యాయులు చేరారని ఎంఈవో రామకృష్ణ తెలిపారు. ఇల్లంతకుంట మండలానికి ఆరుగురు టీచర్లు వచ్చారని ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ఏజీపీల నియామకం



కృష్ణను సన్మానిస్తున్న నాయకులు



భానుకృష్ణ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/రుద్రంగి(వేములవాడ): సిరిసిల్ల, వేములవాడ కోర్టులలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లను ప్రభుత్వం నియమించింది. సిరిసిల్ల కోర్టులో ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన పి.కృష్ణ, వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రుద్రంగికి చెందిన పి.భానుకృష్ణలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి నర్సయ్య, మల్లేశంయాదవ్, పిల్లి కిషన్‌యాదవ్, పుణ్యానాయక్, ప్రభునాయక్, గుండాడి రాంరెడ్డి శాలువా కప్పి సన్మానించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి



ఓటర్ నమోదు కేంద్రంలో ప్రసన్న హరికృష్ణ

బోయినపల్లి(చొప్పదండి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే శాసనమండలిలో పట్టభద్రుల గొంతుకనవుతానని అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ పేర్కొన్నారు. బోయినపల్లిలో ఉచిత ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. హరికృష్ణ మాట్లాడుతూ గత పదేళ్లుగా నిరుద్యోగులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు మోటివేషన్ క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. పట్టభద్రులు ఓటర్‌గా నమోదుచేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ప్రతిభ పోటీలు



సిరిసిల్ల ఎడ్యుకేషన్: వికసిత్ భారత్‌లో భాగంగా బుధవారం సిరిసిల్లలోని సినారె కళామందిర్‌లో విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించారు. డీఈవో రమేశ్‌కుమార్ అధ్యక్షతన, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ వి.శైలజ ఆధ్వర్యంలో వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, విజువల్ ఆర్ట్స్ 2డీ, 3డీ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని 64 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా బాల్‌రెడ్డి, సనాబాబు, దేవేందర్, శంకరయ్య, కపిల్ల నరేశ్ వ్యవహరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సిరిసిల్లటౌన్: పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. సిరిసిల్ల ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో బీజేపీకి ప్రజల్లో ఆదరణ అధికంగా ఉందన్నారు. ప్రజాసమస్యలపై పోరాడి, పరిష్కారానికి కృషిచేయాలన్నారు. పెద్ద ఎత్తున సభ్యత్వాల నమోదు చేయించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు అన్నల్‌దాస్ వేణు, బూర విష్ణు పాల్గొన్నారు.

ఇక ఇందిరమ్మ కమిటీలు !



ఇది వేములవాడరూరల్ మండలం చెక్కపల్లిలో 2023 ఆగస్టులో అధికారులు గృహలక్ష్మీ పథకంలో భాగంగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్వే. నిజమైన ఇల్లు లేని పేదలను గుర్తించేందుకు అధికారులు అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్‌లో ఫొటోలతో సహ అప్‌లోడ్ చేశారు. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గృహలక్ష్మీ పథకం రద్దయ్యింది. ఇప్పుడు కొత్తగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందు కొచ్చింది. దీంతో ఇల్లు లేని పేదల్లో సొంతింటి ఆశలు చిగురించాయి.



ఇవి తంగళ్లపల్లి మండలం మండెపల్లి ఇందిరమ్మకాలనీలో అర్ధంతరంగా నిలిచిన ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్‌లు. 2012లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ హౌసింగ్ స్లమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఐహెచ్ఎస్‌డీపీ)లో భాగంగా పక్కా ఇళ్ల పథకాన్ని అమలు చేసింది. సిరిసిల్ల పట్టణంలో అద్దె ఇళ్లలో నివసించే నిరుపేద పవర్‌లూం, బీడీ కార్మికులకు 75 గజాల ఇంటి స్థలాన్ని అందించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి అప్పట్లో ఐహెచ్ఎస్‌డీపీలో రూ.73 వేల చొప్పున మంజూరు చేశారు. ఇది పూర్తి గ్రాంటుగా మంజూరుకావడంతో ఆ సొమ్ము తిరిగి చెల్లించనవసరం లేదు. కానీ బిల్లుల మంజూరులో జాప్యంతో ఏకంగా 611 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి.



ఇవి తంగళ్లపల్లి మండలం సారంపల్లి శివారులో అర్ధంతరంగా నిలిచిన నిర్మాణాలు. సారంపల్లి, మండెపల్లి శివారుల్లోని సర్వేనంబర్ 377, 449లో వేర్వేరుగా 1993 మంది పేదలకు ఇళ్ల పట్టాలను రెవెన్యూ అధికారులు అందించారు. ఐహెచ్ఎస్‌డీపీలో మంజూరుచేసిన రూ.73వేలు సరిపోక లబ్ధిదారులు అప్పులపాలయ్యారు. దీంతో ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారు. ఫలితంగా ఇప్పటికీ ఇలాగే ఉన్నాయి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలులోకి తేవడంతో 12 ఏళ్ల కిందట ఇళ్లను కట్టుకుని మధ్యలో వదిలేసిన పేదల్లో ఆశలు చిగురించాయి. ఇల్లు నిర్మించుకోవచ్చని ఆశపడుతున్నారు.

- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు మంజూరు
- జిల్లాలో 7వేల ఇళ్లకు అవకాశం
- స్థలం ఉన్న వారికే తొలి విడతలో ప్రాధాన్యం

జిల్లాలోని గ్రామీణ పేదల సమాచారం

రేకుల షెడ్లు	1241
చిన్నస్థాయి పెంకుటిళ్లు	1220
అద్దె ఇళ్లలో ఉండే పేదలు	1595
శిథిలావస్థలో ఉన్న ఇళ్లు	961
ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులు	1,10,198

సిరిసిల్ల: ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పేదల్లో సొంతింటిపై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం సొంత స్థలం ఉండి.. ఇల్లు నిర్మించుకోవాలనుకుంటున్న వారితోపాటు పుష్కరకాలం క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మంజూరై.. అర్ధంతరంగా నిలిచిన నిర్మాణాలను సైతం పూర్తి చేసుకోవచ్చనే ఆశ అప్పటి లబ్ధిదారుల్లో చిగురిస్తున్నాయి. సొంత స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు మంజూరు చేయనున్నారు.

కమిటీలు ఇలా..

పల్లెల్లో ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, మహిళా సంఘాల సభ్యులు ఇద్దరు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఒక్కో అభ్యర్థితోపాటు పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. అదే పట్టణాల్లో వార్డుకౌన్సిలర్ చైర్మన్‌గా వార్డు అధికారి కన్వీనర్‌గా మరో ఐదుగురు సభ్యులు(ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, మరో ముగ్గురు ఎస్సీ, ఎస్టీ, బీసీలు) వారితో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. తొలుత సొంత స్థలం ఉన్న వారికే ఇల్లు మంజూరు చేయాలని భావిస్తున్నారు.

దరఖాస్తులు మళ్లీ తీసుకుంటారా?

పది నెలల క్రితం ప్రజాపాలనలో ఇంటి నిర్మాణానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తారా..లేక.. కొత్తగా మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తారా? అనే అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. జిల్లా వ్యాప్తంగా 1,10,198 దరఖాస్తులు ఇళ్ల నిర్మాణం కోసం రాగా.. నిజానికి ఇందులో పదో వంతే అర్హులైన పేదలు ఉన్నారని భావిస్తున్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను తొలివిడతగా మంజూరు చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన జిల్లాకు 7000 ఇళ్లు మంజూరు కానున్నాయి.

కమిటీలు వేయాలని చెప్పాను



పేదలకు ఇళ్ల మంజూరు పారదర్శకంగా ఉండేలా ఇందిరమ్మ కమిటీలను వేయాలని జిల్లా అధికారులకు చెప్పాను. ప్రభుత్వం కూడా ఆదేశాలు జారీ చేసింది. ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు మంజూరుచేస్తాం. అర్హుల జాబితాను క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేస్తాయి. ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తాయి. ఈ పథకం అమలులోకి వస్తే పేదల సొంతింటి కల నెరవేరుతుంది.

– ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే

కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం



జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటవుతున్నాయి. కమిటీకి ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, మరో ముగ్గురు ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారికి కమిటీల్లో అవకాశం కల్పిస్తున్నాం. జిల్లాలో అన్ని గ్రామాల నుంచి నివేదికలు రాగానే కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం.

– శేషాద్రి, ఇన్‌చార్జి డీపీవో, రాజన్నసిరిసిల్ల

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- బస్తాకు 40.600 కిలోలు తూకం
- కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఆవునూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ధాన్యం శుభ్రంగా ఉండి.. తాలు లేకుండా ఉంటే బస్తాకు 40 కిలోల 600 గ్రాములు తూకం వేస్తారని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్, గూడెం, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. క్వింటాలుకు గతంలో 5 కిలోల ధాన్యం అదనంగా పోయేదని, ఇప్పుడు ఒక్క గ్రాము ధాన్యం కూడా అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మూడు రోజుల్లోనే ధాన్యం డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. సన్న వడ్లు సేకరణకు ప్రత్యేక కౌంటర్లు పెట్టామన్నారు. 17 శాతం కన్న తక్కువగా తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, కామన్ గ్రేడ్‌కు రూ.2,300 చొప్పున మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌లు రాణినర్సింలు, సాబేరా బేగం, సింగిల్‌విండో చైర్మన్‌లు తన్నీరు బాపురావు, గుండారపు కృష్ణారెడ్డి, డీసీవో రామకృష్ణ, డీఎస్‌వో వసంతలక్ష్మి, డీఎం రజిత, డీఆర్డీవో శేషాద్రి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, బండారి బాల్‌రెడ్డి, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో రాజేందర్, డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రుద్రవరం పీఏసీఎస్ భవనం ప్రారంభం



రుద్రవరంలోని పీఏసీఎస్ భవనం ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కొండూరి రవీందర్‌రావు

వేములవాడఅర్బన్: రైతులను రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలం రుద్రవరంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బ్యాంకు చైర్మన్లు అంకితభావంతో పనిచేయడంతోనే సహకారబ్యాంక్‌లు ఈ స్థాయికి ఎదిగాయన్నారు. సింగిల్‌విండో చైర్మన్లు రేగులపాటి కృష్ణదేవరావు, ఏనుగు తిరుపతిరెడ్డి, సల్మాన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, చింతపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

శుద్ధిచేసిన ధాన్యాన్నే సేకరించాలి

- ఏఈవో సర్టిఫై చేసిన వడ్లను కొనాలి
- డీఆర్డీవో శేషాద్రి



మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

సిరిసిల్ల: సవరించిన ఓపీఎంఎస్‌లో రైతులవారీగా వివరాలు నమోదు చేయాలని, శుద్ధి చేసిన ధాన్యాన్నే కొనాలని డీఆర్‌డీవో శేషాద్రి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ధాన్యం కొనుగోళ్లపై డీఆర్‌డీఏ సిబ్బందికి, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు, బుక్ కీపర్లకు, కమిటీ సభ్యులకు శిక్షణనిచ్చారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. ఏఈవోలు సర్టిఫై చేస్తేనే ధాన్యం కొనుగోలు చేయాలని డీఆర్‌డీవో స్పష్టం చేశారు. సన్నవడ్లను, దొడ్డు వడ్లను వేర్వేరుగా సేకరించాలని, సన్నాలపై రూ.500 బోనస్ ఇస్తున్నందునా జాగ్రత్తగా సేకరించాలని సూచించారు. కేటాయించిన రైస్‌మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించాలని తెలిపారు. అదనపు డీఆర్‌డీవో గొట్టె శ్రీనివాస్, డీపీఎంలు ఎం.సుధారాణి, ఎం.శ్రీనివాస్, జిల్లా సమాఖ్య కార్యదర్శి జ్యోతి, పౌరసరఫరాల ఆఫీస్ అధికారులు, నాగాచారి, రాజశేఖర్, ఏపీఎంలు పర్శరాములు, నర్సయ్య, సుదర్శన్, మల్లేశం పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

వేములవాడఅర్బన్: మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన శాసనమండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. రాజకీయ ప్రతినిధులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమై ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై చర్చించారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సన్న, దొడ్డు వడ్లను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, రైతులు ఉండేందుకు నీడ వసతులు కల్పించాలన్నారు. ధాన్యం రవాణా చేసే వాహనానికి జీపీఎస్ సిస్టమ్‌లో నంబరు కేటాయించి డ్రైవర్, క్లీనరు ఫోన్ నంబర్లు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నంబర్లను సన్నరకం ధాన్యం బ్యాగులపై వేయాలని సూచించారు. రైతులకు ముందస్తుగా టోకెన్‌లు అందించాలన్నారు. ఎలక్ట్రానిక్ తూకం మిషన్లు, తేమయంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్‌లు కొనుగోలు కేంద్రాలకు ఎన్ని అందించినారని పౌరసరఫరాల శాఖ అధికారిని ప్రశ్నించారు. రైస్ మిల్లుల వద్ద కోతలు ఉండడానికి వీలులేదన్నారు. జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనాతో ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టి, ప్రమాదాలకు దారి తీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతీ సెంటర్‌కు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్‌డీవో శేషాద్రి, డీఎస్‌వో పి.వసంతలక్ష్మి, పౌరసరఫరాల డీఎం పి.రజిత, డీసీవో రామకృష్ణ, ఇన్‌చార్జి డీఏవో రామారావు ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



తరగతిగదిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వారికి పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. సౌకర్యాలు, భోజనం గురించి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలోని అసంపూర్తిగా ఉన్న తరగతి గది భవనాన్ని పూర్తి చేయాలని సూచించారు. హైస్కూల్‌లో కొత్తగా ఆరు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రహరీ చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను శుభ్రం చేయించాలని ఎంపీవో మీర్జాబేగ్‌ను ఆదేశించారు. మండల విద్యాధికారి రాజు, ప్రధానోపాధ్యాయులు శంకర్ నారాయణ్, వెంకటేశ్వరస్వామి తదితరులు ఉన్నారు.

ప్రజలకు మరింత చేరువ కావాలి

- ఎస్పీ అఖిల్‌మహాజన్
- ఎల్లారెడ్డిపేట ఠాణా తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, గ్రామాల్లో నేరాల నియంత్రణకు విసిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. గ్రేవ్ కేసులు, విచారణలో ఉన్న కేసులు, ట్రయల్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, ఠాణాకు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. బ్లూకోల్ట్ సిబ్బంది డయల్ 100కు కాల్ రాగానే వెంటనే స్పందించాలని సూచించారు. బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బంది పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతనేరస్తులు, అనుమానితులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్, ట్రెయినీ ఎస్సై రాహుల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

స్థానిక అవసరాలకు ఇసుక

- పర్మిట్లు జారీచేసిన రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్ల: సిరిసిల్లలో స్థానిక అవసరాలకు మానేరువాగు నుంచి ఇసుక రవాణాకు రెవెన్యూ అధికారులు బుధవారం అనుమతించారు. రెవెన్యూశాఖ రెండు నెలలుగా ఇసుక రవాణాకు పర్మిట్లు నిలిపివేసింది. కొందరు అక్రమార్కులు రాత్రి వేళల్లో దొంగతనంగా ఇసుకను ఎక్కువ ధరలకు తరలించడం ప్రారంభించారు. ఒక్క ట్రిప్పునకు రూ.1500 ఉండే ఇసుక ఏకంగా రూ.5వేలకు చేరింది. సిరిసిల్లలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ.. ‘చీకటి పూట.. ఇసుక వేట’ శీర్షికన ‘సాక్షి’లో ఈనెల 7న కథనం ప్రచురితమైంది. స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో మాట్లాడారు. స్థానిక అవసరాలకు ఇసుక రవాణాకు పర్మిట్లు జారీ చేయాలని, దూరప్రాంతాలకు అక్రమంగా తరలించే ఇసుకపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ నిబంధనల మేరకు సిరిసిల్ల తహసీల్దార్ ఎం.ఉమారాణి భవన నిర్మాణదారుల నుంచి మున్సిపల్ అనుమతి పత్రాలను తీసుకుని ఫీజులు చెల్లించాలని సూచించారు. ఈమేరకు సిరిసిల్ల మానేరువాగు నుంచి బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇసుక రవాణాకు పర్మిట్లు జారీ చేశారు. రెండు నెలల తరువాత ఇసుక రవాణాకు రెవెన్యూ అధికారులు అనుమతించడంపై సిరిసిల్ల ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాటి రాజ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.


చీకటి పూట.. ఇసుక వేట!

‘సాక్షి’లో ప్రచురితమైన కథనం

పొన్న రథంపై గోవిందుడు



మాడ వీధుల్లో పొన్నరథంపై విహరిస్తున్న శ్రీవారు

సిరిసిల్లటౌన్: అశేష భక్తజనం గోవింద నామస్మరణలతో తిరువీధులు పులకించాయి. శ్రీశాల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అతిముఖ్యమైన ఘట్టం పొన్న రథోత్సవం నిర్వహించారు. శ్రీవారు పొన్నరథంపై విహరించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నమయ్య కీర్తనలను కళాకారులు ఆలపించారు. వికాస తంరగిణి ఆధ్వర్యంలో కోలాటాలు, భజన సంకీర్తనలు గావించారు. పొన్నరథాన్ని లాగడానికి భక్తులు ఉత్సాహం చూపించారు. అంతకుముందు ఉదయం వేళలో వేంకటేశ్వరస్వామిని సిరిసిల్ల సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు దర్శించుకున్నారు. అనంతరం మాడ వీధుల్లో కాలంచెల్లిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను సన్మానించారు. ఆలయ ఈవో మారుతీరావు, ఏఈవో రవీందర్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ అర్చకస్వాములు కృష్ణమాచారి, సెస్ అధికారులు మధుకర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.





స్వామిని దర్శించుకుంటున్న అధికారులు, ఏర్పాట్లు పరిశీలిస్తున్న సెస్ చైర్మన్ రామారావు

క్లుప్తంగా

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


పెద్ద అంజయ్య (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని సిరికొండకు చెందిన చెట్పెల్లి పెద్ద అంజయ్య(56) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై నవీన్ కుమార్ వివరాల ప్రకారం.. పెద్ద అంజయ్య సిరికొండలో సెలూన్ నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం టీ తాగేందుకు హోటల్‌కు వెళ్తుండగా వేగంగా వస్తున్న వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గోరింటాలకు చెందిన ఒకరు..

గంభీరావుపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందాడని ఎస్సై శివకుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలంలోని గోరింటాలకు చెందిన బండెల రాజయ్య(56) మంగళవారం సాయంత్రం కూలీ పని ముగించుకొని, సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మూలపల్లె స్టేజీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్య తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో చిన్నారి..


శ్రీయాన్సి (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ఆడిపాడే వయసులోనే ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. గుండెపోటుతో నాలుగేళ్ల పాప మృతిచెందిన ఘటన జమ్మికుంటలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లికి చెందిన మేడిపల్లి రాజు–జమున దంపతులు బతుకుదెరువు కోసం జమ్మికుంట పట్టణానికి వచ్చారు. రాజు స్థానికంగా ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దంపతులకు ఒక పాప శ్రీయాన్సి(4), బాబు ఉన్నారు. శ్రీయాన్సి మంగళవారం కళ్లు తిరుగుతున్నాయని చెప్పి, తీవ్ర అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో చనిపోయింది. పాప పుట్టిన సమయంలోనే గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని, అప్పుడు గమనించకపోవడం వల్లే పరిస్థితి విషమించి, మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


నర్సయ్య (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): సంతానం కలగడం లేదని ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై పృథ్వీధర్ వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలంలోని మల్కాపూర్‌కు చెందిన బోడ నర్సయ్య (50) గొర్రెల కాపరి. అతనికి 18 ఏళ్ల క్రితం వివాహం కాగా, సంతానం కలగలేదు. దీంతో తరచూ మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో భార్య దసరా పండుగకు పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 15న ఉదయం నర్సయ్య క్రిమిసంహారక మందు తాగాడు. అతని సోదరుడి కుమారుడు రాకేశ్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫీజు బకాయిలు రూ. 150 కోట్లు


జిల్లాకేంద్రంలో మూసి ఉంచిన ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల

- ఎండమావిగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు
- మూతపడ్డ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు
- బీసీ సంక్షేమశాఖలో రూ.113.39 కోట్లు పెండింగ్
- ఎస్‌యూ పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ కళాశాలలు
- 52,663 మందికిపైగా విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం


జగిత్యాలలో బుధవారం సుప్మా ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కళాశాలల యాజమాన్యాలు

కరీంనగర్:

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.150కోట్ల బకాయిల కోసం యాజమాన్యాలు ఆందోళనకు దిగుతున్నాయి. కళాశాలలను బంద్‌చేసి రోడ్డెక్కుతున్నారు. ఫీజు చెల్లించాల్సిందేనంటూ విద్యార్థులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. 52,663 మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడేళ్ల నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో బకాయిలు కొండెక్కి కూర్చున్నాయి. ఒక్క బీసీ సంక్షేమశాఖకు సంబంధించిన బకాయిలు 2021–22, 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించినవే రూ.113.39 కోట్లు రావాల్సి ఉంది. దీంతో బిల్లులు చెల్లించాలని ఆందోళనకు దిగుతున్నారు.

చెల్లింపులకు మోక్షమెప్పుడో...

2021–22, 2022–23, 2023–24 విద్యా సంవత్సరాలకు సంబంధించి బీసీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్), స్కాలర్‌షిప్ (ఎంటీఎఫ్) కింద జిల్లాకు రూ.113 కోట్ల 39 లక్షల బకాయిలు రావాల్సి ఉంది. బీసీ సంక్షేమశాఖలో మూడేళ్లలో ఎంటీఎఫ్ కింద 34,102 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మొత్తంగా రూ.3కోట్ల 34 లక్షల 65 వేల బకాయిలు రావాల్సి ఉంది. ఈబీసీ కేటగిరీలో ఆర్టీఎఫ్ కింద మూడేళ్లల్లో 3,755 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రూ.96 కోట్ల 35 లక్షల 50వేలు రావాల్సి ఉంది. ఈబీసీ ఆర్‌టీఎఫ్ కింద రూ.13 కోట్ల 69 లక్షల 59 వేలు రావాల్సి ఉంది. 150 కోట్ల నుంచి బీసీ విద్యార్థులకు సంబంధించి 113 కోట్ల 39 లక్షలు పోను మిగితా 37 కోట్లు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండటం గమనార్హం.

సర్టిఫికెట్లు ఇవ్వకుండా కొర్రీలు

స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి. పరీక్షలు సమీపిస్తుండడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల పేరిట వేధింపులకు గురిచేస్తున్నాయి. ప్రశాంత వాతావరణలో పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన తరుణంలో ఫీజు ఒత్తిడి మానసికంగా గందరగోళానికి గురి చేస్తోంది. చదువు పూర్తిచేసుకున్న విద్యార్థులకు టీసీలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి పలు కళాశాలల యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కళాశాలకు వెళ్లి అడిగితే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందలేదని, వచ్చాకే సర్టిఫికెట్లు ఇస్తామని కొర్రీ పెడుతున్నారు. లేదంటే ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని సలహా ఇస్తున్నారు.

చదివిన బడిలోకే సారుగా..

- కొత్త టీచర్లలో పలువురికి దక్కిన అవకాశం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

‘ఏళ్లుగా కష్టపడి చదివారు.. ప్రభుత్వ ఉద్యోగం సాధించేవరకు పట్టు వదల్లేదు.. చివరకు టీచర్, పీడీ కొలువులు సాధించారు.. కొలువు కోసం నిర్వహించిన పరీక్షలో విజయం సాధించడం ఒక ఎత్తయితే.. తాము చదువుకున్న బడిలోకే సారుగా వెళ్లడం వారి సంతోషాన్ని రెట్టింపు చేసింది. చిన్నప్పుడు ఆడిపాడి, అల్లరి చేసిన తమ పాఠశాలకు బుధవారం ఉద్యోగులుగా వెళ్లిన పీడీ రమేశ్, టీచర్లు వేణుకుమార్, రాజు ఆనందం వ్యక్తం చేశారు.’

ఆడుకున్న స్థలంలో అడుగుపెట్టా



రాయికల్(జగిత్యాల): నేను చదువుకుంటూ, ఆడిపాడిన పాఠశాలలోనే పీడీగా ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. ఆడుకున్న స్థలంలో అడుగుపెట్టడం ఒక క్రీడాకారుడిగా, పూర్వ విద్యార్థిగా గర్వంగా ఉంది. రాయికల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి వరకు, జెడ్పీహెచ్ఎస్‌లో 6 నుంచి 8వ తరగతి వరకు, కట్లకుంట జెడ్పీహెచ్ఎస్‌లో 9, 10వ తరగతులు, మేడిపల్లి గురుకులంలో ఇంటర్మీడియట్ చదివాను. చదువుకున్న రాయికల్ హైస్కూల్‌లోనే నేను పీడీగా ఉద్యోగం సాధించడం చెప్పలేని అనుభూతినిస్తోంది. విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తయారు చేసేందుకు నావంతు ప్రయత్నం చేస్తా.

– పుర్రె రమేశ్ పీడీ, రాయికల్ హైస్కూల్

కలలో కూడా ఊహించలేదు



రుద్రంగి(వేములవాడ): మాది రుద్రంగి మండల కేంద్రం. నేను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాను. విద్యాబుద్ధులు నేర్పిన బడిలో టీచర్‌గా చేరడం చెప్పలేని ఆనందాన్నిస్తోంది. ఇది నేను కలలో కూడా ఊహించలేదు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తూ, వారు క్రమశిక్షణతో మెలిగేలా చూస్తా. సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేందుకు, మంచి మార్కులతో ఉత్తీర్ణలయ్యేందుకు నా వంతు కృషి చేస్తా.

– వేణుకుమార్, టీచర్, జెడ్పీ హైస్కూల్, రుద్రంగి

చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి



గంభీరావుపేట(సిరిసిల్ల): మాది గంభీరావుపేట. నేను స్వగ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నాను. ఇప్పుడు ఇదే బడిలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్)గా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. పాఠశాలలో ఉంటే నా చిన్ననాటి జ్ఞాపకాలు, నాకు చదువు చెప్పిన సార్లు గుర్తొస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తా.

– శనిగరపు రాజు, టీచర్, జెడ్పీ బాలుర హైస్కూల్, గంభీరావుపేట

విధుల్లో చేరిన 12 మంది టీచర్లు

మంథని: డీఎస్సీ–2024లో ఎంపికైన 12 మంది(పది మంది స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు ఎస్జీటీలు) కొత్త టీచర్లు మంథని మండలంలో తమకు కేటాయించిన పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు. తొలుత వారికి ఎంఈవో లక్ష్మి, ఆరెంద కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీలత జాయినింగ్ ఆర్డర్ అందజేశారు. సీఆర్పీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


జాయినింగ్ ఆర్డర్ ఇస్తున్న ఎంఈవో లక్ష్మి

అధిక వడ్డీ పేరిట డబ్బుల వసూలు

- అన్నపై తల్లితో కలిసి తమ్ముడి ఫిర్యాదు
- ప్రజలు మోసపోవద్దని సూచన



మాట్లాడుతున్న కమలాకర్, రామవ్వ

సిరిసిల్లటౌన్: అధిక వడ్డీ ఆశచూపి, ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాడంటూ ఓ వ్యక్తిపై సొంత తమ్ముడే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో అతను వివరాలు వెల్లడించాడు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన జిందం రాజు రెండేళ్లుగా కర్పూరం బిజినెస్ చేస్తున్నానంటూ అమాయకులకు అధిక వడ్డీ ఆశ చూపి, డిపాజిట్లు సేకరిస్తున్నాడు. రూ.లక్ష ఇస్తే రోజుకు రూ.300 వడ్డీ ఇస్తానని చెప్పి, తీసుకున్న మొత్తం నుంచే చెల్లిస్తున్నాడు. నెలకు రూ.9 వేల వడ్డీ రావడంతో పలువురు పెద్ద మొత్తంలో రాజుకు డబ్బులిస్తున్నారు. గత ఏప్రిల్‌లో సిరిసిల్లలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో రాజుపై 420 కేసు నమోదు చేశారు. కాగా, స్టేషన్ బెయిల్ కావడంతో అతను మళ్లీ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నాడు. ఎలాంటి కష్టం లేకుండా కోటీశ్వరుడు కావాలన్న తలంపుతో రాజు ఇలా చేస్తున్నాడంటూ అతని తమ్ముడు కమలాకర్, తల్లి రామవ్వ సెప్టెంబర్ 2న ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయినా, రాజు ఎలాంటి భయం లేకుండా లేని కర్పూరం కంపెనీని ఉన్నట్లు చూపుతూ సులభంగా వస్తున్న డబ్బుతో ఒంటిపై బంగారం వేసుకొని, గోల్డ్‌మెన్‌గా అందరి దృష్టిలో పడ్డాడని ఆరోపిస్తున్నారు. ప్రజలు రాజును నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నారు. అతను గతంలోనూ మోసాలకు పాల్పడ్డాడని, డిపాజిట్లు చేసినవారు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

ఊడిపోయిన ఆర్టీసీ బస్సు రాడ్డు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం


రోడ్డుపై నిలిచిపోయిన బస్సు

రాయికల్(జగిత్యాల): జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం రాయికల్ నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. అల్లీపూర్ శివారులో ఒక్కసారిగా బస్సు కింది భాగంలోని రాడ్డు ఊడిపోయింది. డ్రైవర్ అప్రమత్తమై, బస్సును నిలిపివేశారు. దీంతో మొత్తం 53 మంది ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా డ్రైవర్‌ను పలువురు అభినందించారు.

పాఠశాల ల్యాబ్‌లో చోరీ


ల్యాబ్‌లో పరిశీలిస్తున్న పోలీసులు

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ల్యాబ్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియ ని వ్యక్తులు చొరబడ్డారు. పలు సైన్స్ పరికరాలను ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని ఎంఈవో వేణుకుమార్ తెలిపారు. పోలీసులు బుధవారం ల్యాబ్‌ను పరిశీలించారు. ఎంఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మిస్డ్ కాల్‌తో ఓటు నమోదు చేసుకోండి

- పట్టభద్రులకు హెల్ప్‌లైన్ 92400 21444
- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్ రెడ్డి తదితరులు

కొత్తపల్లి/కరీంనగర్: పట్టభద్రులు 92400 21444 హెల్ప్‌లైన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి, ఓటు నమోదు చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి కోరారు. బుధవారం కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో మిస్డ్ కాల్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరించారు. పట్టభద్రుల ఓటు నమోదుకు సహకరించేందుకు 50 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఒక కలర్ ఫోటోతోపాటు ఒరిజినల్ డిగ్రీ మెమోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. తనను ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు మంజూరయ్యేలా చూస్తానన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ప్రత్యేక యాప్ రూపొందించి, 6 నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తానని తెలిపారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. వివిధ కళాశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా


పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా రెజ్లర్లు

కరీంనగర్‌రూరల్: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెజ్లర్లు సత్తా చాటారు. హైదరాబాద్‌లో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–19 రెజ్లింగ్ పోటీల్లో మూడు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన పి.విజయ్‌కుమార్, టి.సిద్ధార్థలు రజత, బి.నర్సింహ, కె.రాజరథన్, ఎస్.దినేశ్‌లు కాంస్య పతకాలు గెలిచారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలకు చెందిన కె.రాజు రజత, కె.అజయ్ కాంస్య, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన వి.రఘుచరణ్ కాంస్య, ట్రినిటీ జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్.ఆదిత్య మహరాజ్ కాంస్య పతకాలు సాధించినట్లు టీం కోచ్ ఎం.వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ కరీం, కళాశాలల క్రీడా సమాఖ్య కరీంనగర్ జిల్లా కార్యదర్శి మధు జాన్సన్ అభినందించారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.లక్షల్లో నష్టం

- యాప్ తెరుచుకోక పోవడంతో బాధితుల ఆందోళన


యాప్‌ను చూపుతున్న బాధితుడు

జగిత్యాల క్రైం: ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ చెల్లిస్తామని ఆశ చూపితే, పెట్టి మోసపోయిన పలువురు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన కొంతమంది ఒక్కొక్కరు రూ.లక్ష వరకు ఆర్జీఏ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. మూడు రోజులు పని చేసిన ఆ యాప్ మంగళవారం నుంచి తెరుచుకోవడం లేదు. దీంతో బాధితులు తాము నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టించిన వ్యక్తికి ఫోన్ చేస్తే తనకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నాడని వాపోతున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

- నర్మాల ఎగువ మానేరులో దూకి అఘాయిత్యం
- మృతుడిది కామారెడ్డి జిల్లా

గంభీరావుపేట(సిరిసిల్ల): అప్పుల బాధతో ఓ వ్యక్తి నర్మాల ఎగువ మానేరులో దూకి, ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శివకుమార్ వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఇసాయిపేటకు చెందిన గుడ్లపల్లి ప్రకాశ్(55) కూలీ పనుల నిమిత్తం ఇదే మండలంలోని వెల్బగొండలో నివాసం ఉంటున్నాడు. కూతురి వివాహం, భార్య ఆస్పత్రి ఖర్చులతో అప్పులపాలయ్యాడు. వాటిని ఎలా తీర్చాలంటూ కుటుంబసభ్యులతో నిత్యం బాధ పడేవాడు. ఈ క్రమంలో మంగళవారం కూలీ పనికి వెళ్తున్నానని చెప్పి, బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా, ఫలితం లేకపోయింది. బుధవారం గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు సమీపంలో అతని దుస్తులు కనిపించాయి. దీంతో ప్రాజెక్టులో పరిశీలించగా ప్రకాశ్ మృతదేహం కనిపించింది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెలంగాణ స్టేజీ–2లో కదలిక

- పీసీబీకి వివరాలు అందజేసిన ఎన్టీపీసీ
- డిసెంబర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ?



జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాంతంలో తెలంగాణ స్టేజీ–2 విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులు ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. దీనికింద చేపట్టే 2,400 (ఒక్కోటి 800 మెగావాట్లు గల మూడు యూనిట్లు) మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు పూర్తి వివరాలతో కూడిన డాక్యుమెంట్లను ఎన్టీపీసీ టీటీఎస్‌లోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు బుధవారం అందజేశారు. రామగుండం పాత యాష్ పాండ్ ఏరియాలో స్టేజీ–2 ప్లాంట్ నిర్మాణం కోసం సుమారు 606 ఎకరాలు ఇప్పటికే సేకరించారు. వచ్చే డిసెంబర్‌లో దీనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారని అధికారులు వివరించారు. తెలంగాణ పునర్విభజన చట్టంలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మించాలనేది నిబంధన. ఇందులో భాగంగా స్టేజీ–1లో ఇప్పటికే 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగల రెండు యూనిట్లు నిర్మించారు.

భూగర్భ గనుల్లో ఐదేళ్ల అనుభవం

- యువ కార్మికులకు తప్పనిసరి
- సింగరేణిలో నిబంధనల మార్పు!



గోదావరిఖని(రామగుండం): సింగరేణి యువ కార్మికులు ఇకనుంచి భూగర్భగనిలో ఐదేళ్లపాటు పనిచేయాల్సిందేనా? విధుల్లో చేరగానే అండర్‌గ్రౌండ్‌లో విధులు నిర్వర్తించాల్సిందేనని మెలిక పెడుతున్నట్లు సమాచారం. ఈమేరకు నిబంధనలు మార్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు సంస్థ సీఎండీ బలరాం అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. యువకార్మికుల విషయంలో యాజమాన్యం ఇకనుంచి కఠినంగా వ్యవహరిస్తుందని సమాచారం. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై జీఎంలతో ఇటీవల సమీక్షించిన సీఎండీ.. తాజా వ్యాఖ్యలు చేయడంతో యువ కార్మికుల్లో ఆందోళన మొదలైంది. మహిళా కార్మికులు కూడా భూగర్భగనుల్లో పని చేయాల్సిందేనని అంటున్నారు.

15 వేల మంది యువ కార్మికులు..

సంస్థలో సుమారు 15వేల మంది యువ కార్మికులు ఉన్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన వారిస్థానంలో వారిపిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఉద్యోగాల్లో చేరిన చాలా మందిలో ఉన్నత విద్య అభ్యసించిన వారే ఉన్నారు. విద్యార్హతలకు సమానస్థాయిలో ఉద్యోగాలు కావాలనే పట్టుదలతో వారు ఉన్నారు. లేనిపక్షంలో పక్షంలో కనీసం ఉపరితల పనులు ఇవ్వాలని కోరుతున్నారు. ఈక్రమంలో అండర్‌గ్రౌండ్(భూగర్భ)గనుల్లో పనిచేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని యాజమాన్యం పేర్కొంటోంది. అయితే ప్రతీ అంశానికి భూగర్భగనిలో పనిచేసిన అనుభవం తప్పనిసరి కావడంతో యువకార్మికులను అందులో విధులు నిర్వహించాల్సిందేనని నిర్ణయించినట్లు సమాచారం.

పెరిగిన రాజకీయ జోక్యం..

సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో చాలామంది కార్మికులు విధుల్లో చేరీచేరగానే లైట్ జాబ్‌లవైపు దృష్టి సారిస్తున్నట్లు చెబుతున్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలతోపాటు రాష్ట్రంలోని అధికారం కాంగ్రెస్, దేశంలోని బీజేపీ ప్రజాప్రతినిధులు సింగరేణి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో చాలామంది భూర్భగనుల్లోకి వెళ్లకుండా డిపార్ట్‌మెంట్లు, ఓసీపీల్లో విధులు కల్పించాలని ఒత్తిడి తీసుకొస్తున్నట్లు యాజమాన్యం గుర్తించింది.

గైర్హాజరు కార్మికులపై సీరియస్

యువకార్మికుల్లో చాలామంది విధులకు గైర్హాజరవుతున్నారనే విషయాన్ని యాజమాన్యం గుర్తించింది. వివరాలు సేకరించిన అధికారులు.. ఇప్పటికే గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏడాదిలో వంద మస్టర్ల కన్నా తక్కువ ఉన్న కార్మికులపై ఫోకస్ పెట్టారు. ఈక్రమంలో గైర్హాజర్ కార్మికుల వివరాల సేకరిస్తున్నారు. డ్యూటీలు చేయని వారిని విధుల్లోంచి తొలగించాలని సీఎండీ ఆదేశాలు జారీచేయడంతో గైర్హాజరు కార్మికుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారే పరిస్థితి నెలకొంది.

మహిళా కార్మికులకు అండర్‌గ్రౌండ్ డ్యూటీ

సంస్థలో మహిళా కార్మికుల సంఖ్య పెరిగింది. అయితే ఇప్పటివరకు మహిళా కార్మికులు డిపార్ట్‌మెంట్లు, జీఎం కార్యాలయాలు, గని ఉపరితలాలపై పనిచేస్తున్నారు. ఇకనుంచి వారిని కూడా భూగర్భ గనుల్లోకి పంపించాలనే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేస్తున్నట్లు చెబుతున్నారు. కోలిండియాలో మహిళా కార్మికులు పనిచేస్తున్న క్రమంలో సింగరేణిలో కూడా వారి సేవలను భూగర్భగనుల్లో వినియోగించుకోవాలని చూస్తున్నారు.

భూగర్భ గనిలో పని చేయాల్సిందే..



కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువ ఉద్యోగులు ఐదేళ్లు అండర్‌గ్రౌండ్‌లో పనిచేయాల్సిందే. భూగర్భగనుల్లో అనుభవం ఉన్న సీనియర్ కార్మికులు ఉద్యోగవిరమణ పొందారు. వారిస్థానంలో పనిచేసేవారు తగ్గిపోతున్నారు. దీంతో భూగర్భగనుల్లో కార్మికుల సంఖ్య తగ్గింది. ఆ లోటు భర్తీ చేసేందుకు జూనియర్లకు విధులు కేటాయిస్తాం. అలాగే మహిళా కార్మికులను కూడా భూగర్భగనుల్లో విధులు కేటాయించేలా ఆలోచన చేస్తున్నాం.

– బలరాం, సింగరేణి సీఎండీ